సాక్షి
మంచిర్యాల
శనివారం । 28 । సెప్టెంబర్ । 2024

గరిష్టం/కనిష్టం
32.0 /26.0

వాతావరణం
ఆకాశం మేఘావృతమై ఉంటుంది. ఆగ్నేయం దిశగా ఈదురుగాలులు వీస్తాయి. గరిష్ట ఉష్ణోగ్రతలు స్వల్పంగా పెరిగే అవకాశం ఉంది.


నవరాత్రులకు మండపాల్లో ప్రతిష్ఠకు సిద్ధమైన దేవి విగ్రహం


వేంపల్లిలో దేవి విగ్రహాల తయారీలో నిమగ్నమైన కళాకారులు


విక్రయానికి సిద్ధంగా ఉన్న ప్రతిమలు

దుర్గమ్మ.. ముస్తాబు..

మంచిర్యాలరూరల్(హాజీపూర్): జిల్లాలోని గ్రామీణ, పట్టణ ప్రాంతాల్లో దుర్గాదేవి నవరాత్రులు, దసరా ఉత్సవాల సందడి మొదలైంది. దేవి శరన్నవ రాత్రి ఉత్సవాలు అక్టోబర్ 3నుంచి ప్రారంభం కానున్నాయి. జిల్లా వ్యాప్తంగా దుర్గాదేవి నవరాత్రి మహోత్సవాలు ఘనంగా నిర్వహించడానికి సిద్ధమవుతున్నారు. ప్రతీయేటా ప్రత్యేక మండపాల్లో ప్రతిమలు ఏర్పాటు చేసి నవరాత్రులను అంగరంగ వైభవంగా నిర్వహించి గోదావరి నదిలో నిమజ్జనం చేయడం ఆనవాయితీగా వస్తోంది. దాదాపు 30ఏళ్లకు పైగా విగ్రహాల తయారీలో ఉన్న స్థానిక కళాకారులతోపాటు రాజస్థానీ, కోల్‌కతాకు చెందిన వారు కూడా ఉన్నారు. మంచిర్యాల సమీపంలోని వేంపల్లి గ్రామ శివారులో దుర్గాదేవి విగ్రహాలకు తుది మెరుగులు దిద్దుతున్నారు. అన్నపూర్ణేశ్వరీ, సింహవాహిని, మహంకాళి, పులి వాహనంపై స్వారీ చేస్తున్న మాతేశ్వరీ తదితర రూపాల్లో అమ్మవారి విగ్రహాలను తయారు చేస్తున్నారు. కొన్నింటి తయారీ పూర్తి కాగా మరికొన్ని చివరి దశలో ఉన్నాయి. ఒక్కో ప్రతిమను రూ.5 వేల నుంచి రూ.25 వేల వరకు విక్రయిస్తున్నారు.

న్యూస్‌రీల్

మలుపులు తిరుగుతున్న మత్తడి పేల్చివేత కేసు

చెన్నూర్: చెన్నూర్ శనిగకుంట మత్తడి పేల్చివేత కేసు మలుపులు తిరుగుతోంది. కేసు విచారణలో భాగంగా ఇద్దరు ప్రముఖ కాంగ్రెస్ నాయకులతోపాటు మరో యువకుడిని పోలీసులు శుక్రవారం అదుపులోకి తీసుకోవడం పట్టణంలో చర్చనీయాంశంగా మారింది. ఈ నెల 16న మత్తడిని పేల్చివేసిన విషయం తెలిసిందే. ఈ ఘటనలో ఇప్పటికే పెండ్యాల లక్ష్మణ్, గోగుల దానయ్య, భీమ్ లక్ష్మణ్, రాసమల్ల శ్రీనివాస్‌లను పోలీసులు అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించారు. విచారణలో భాగంగా ప్రధాన నిందితులు పెండ్యాల లక్ష్మణ్, గోగుల దానయ్యలను పోలీసులు గురువారం కస్టడీలోకి తీసుకుని విచారణ జరిపారు. శుక్రవారం తెల్లవారు జామున చెన్నూర్ పట్టణానికి చెందిన కాంగ్రెస్ నాయకులు గొడిసెల బాపురెడ్డి, పెద్దింటి శ్రీనివాస్‌లతోపాటు లక్కం రాజబాపులను ఇళ్ల నుంచి అదుపులోకి తీసుకుని విచారణ జరిపి పంపించారు. బీఆర్‌ఎస్ నాయకులు రాంలాల్‌గిల్డా, మాజీ మార్కెట్ కమిటీ చైర్మన్, బీజేపీ నాయకులు బత్తుల సమ్మయ్య ఇళ్లకు పోలీసులు వెళ్లగా పరారీ అయినట్లు తెలిసింది. దీంతో పోలీసులు రాంలాల్‌గిల్డా కుమారుడు, బావతోపాటు బత్తుల సమ్మయ్య బంధువులను స్టేషన్‌కు తీసుకొచ్చి రాంలాల్‌గిల్డా, బత్తుల సమ్మయ్య ఎక్కడికి వెళ్లారనే విషయమై ఆరా తీసినట్లు తెలిసిందే. ఈ కేసులో శుక్రవారం మరికొందరిని పోలీసులు విచారణ చేయడంతో కేసు మలుపులు తిరుగుతోందనే చర్చ జరుగుతోంది. కేసు విషయమై చెన్నూర్ సీఐ రవీందర్‌ను సంప్రదించగా.. చెన్నూర్‌కు చెందిన ఇద్దరిని విచారించి పంపించామని, మరికొందరిని విచారించాల్సి ఉందని, విచారణ పూర్తయిన తర్వాత వివరాలు వెల్లడిస్తామని తెలిపారు.

ప్రైవేటు ఆసుపత్రుల్లో తనిఖీలు


అనుమతి పత్రాలు పరిశీలిస్తున్న బృందం

మంచిర్యాలటౌన్: జిల్లా కేంద్రంలోని పలు ప్రైవేటు ఆసుపత్రులు, ఆర్‌ఎంపీలు నిర్వహిస్తున్న క్లినిక్‌లను జిల్లా వైద్య, ఆరోగ్యశాఖ ఆధ్వర్యంలో వైద్య బృందం తనిఖీ చేసింది. జిల్లాలోని ఐదుగురు జిల్లా వైద్య, ఆరోగ్య శాఖ ప్రోగ్రాం ఆఫీసర్ల ఆధ్వర్యంలో ఐదు బృందాలు ఏర్పాటు చేసి వైద్య, ఆరోగ్యశాఖ నిబంధనల ప్రకారం ఆసుపత్రులు నిర్వహిస్తున్నారో లేదో పరిశీలిస్తున్నారు. ఆర్‌ఎంపీలు వారి అర్హతకు మించి వైద్యం అందించడంతోపాటు ఇష్టారీతిన యాంటిబయోటిక్స్ మందులను రోగులకు అందించి వారి ప్రాణాల మీదకు తెస్తున్న సంఘటనలు చోటు చేసుకుంటున్న నేపథ్యంలో తనిఖీలు చేపడుతున్నారు. ప్రైవేటు ఆసుపత్రుల్లోని వైద్యుల అర్హతలు, వైద్య సేవల వివరాలను పట్టిక రూపంలో ప్రదర్శించాలని, అందులోని వైద్యులు సేవలను అందిస్తున్నారా లేదా అని ఆరా తీస్తున్నారు. అన్ని ప్రైవేటు ఆసుపత్రుల్లో తనిఖీలు పూర్తి చేసిన అనంతరం నిబంధనలు ఉల్లంఘించిన వాటిపై చర్యలకు వైద్య, ఆరోగ్య శాఖ కసరత్తు చేస్తోంది.

ఎరువుల దుకాణాలు తనిఖీ


కిష్టంపేటలో రిజిస్టర్లు పరిశీలిస్తున్న డీఏవో

చెన్నూర్‌రూరల్: మండలంలోని కిష్టంపేట, సోమనపల్లి, ఒత్కులపల్లి, ఆస్నాద గ్రామాల్లో ఫెర్టిలైజర్ దుకాణాలను జిల్లా వ్యవసాయాధికారి కల్పన శుక్రవారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఎరువుల స్టాక్ రిజిస్టర్లు పరిశీలించారు. డీలర్లకు పలు సూచనలు చేశారు. రైతులకు తప్పకుండా బిల్లులు ఇవ్వాలని, ఎరువుల అమ్మకాలు పీఓఎస్ మిషన్ ద్వారానే జరగాలని సూచించారు. స్టాక్ రిజిస్టర్లు అప్డేట్ చేయాలని, స్టాక్ బోర్డులు నిర్వహించాలని తెలిపారు. నిబంధనలు అతిక్రమిస్తే చట్టరీత్యా చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ఆమె వెంట ఏవో మార్క్‌గ్లాడ్‌స్టన్ ఉన్నారు.

అభిప్రాయ సేకరణ

చెన్నూర్: చెన్నూర్ మున్సిపాలిటీ పరిధి 840 సర్వే నంబరులో ఇళ్లు నిర్మించుకున్న యజమానులతో శుక్రవారం స్థానిక మున్సిపల్ కార్యాలయంలో అధికారులు అభిప్రాయ సేకరణ నిర్వహించారు. 23 మంది హాజరైనట్లు మున్సిపల్ కమిషనర్ గంగాధర్ తెలిపారు. కమిషనర్ మాట్లాడుతూ హైకోర్టు ఆదేశాల మేరకు అభిప్రాయాలు సేకరించినట్లు తెలిపారు. అభిప్రాయ సేకరణకు హాజరు కావాలని 34 మందికి నోటీసులు జారీ చేశామని పేర్కొన్నారు. డిప్యూటీ తహసీల్దార్ సనత్‌కుమార్, ఆర్‌ఐ రంజిత్‌కుమార్ సమక్షంలో 23 మంది అభిప్రాయాలు వెల్లడించారని తెలిపారు. మరో 11 మందితో వ్యక్తిగత అభిప్రాయాల సేకరణకు మరో తేదీని ప్రకటిస్తామని తెలిపారు.

చేపపిల్లలేవి..!


నిండుకుండలా ముత్యంపేట చెరువు

- నిండిన జలాశయాలు, చెరువులు
- ఆలస్యమవుతున్న పంపిణీ

దండేపల్లి: జిల్లాలోని చెరువులు, కుంటలు, జలాశయాలు ఇటీవల కురిసిన భారీ వర్షాలతో పూర్తిగా నిండిపోయాయి. ఎక్కడ చూసినా నీటితో కళకళలాడుతున్నాయి. మత్స్యకారులకు ఉపాధి కల్పించడానికి ప్రతియేటా చెరువులు, కుంటలు, జలాశయాల్లో చేపపిల్లలు వదులుతున్నారు. కానీ ఈ ఏడాది చేపపిల్లలు వదలడంలో తీవ్ర జాప్యం జరుగుతోంది. ఇప్పటికీ ఇంకా టెండరు ప్రక్రియ పూర్తికాకపోవడంతో మత్స్యకారుల్లో ఆందోళన వ్యక్తమవుతోంది. పంపిణీకి ఇంకా కొంత సమయం పట్టేలా ఉంది. అధికారులు ఎప్పటిలాగే చేపపిల్లల పంపిణీకి టెండర్ల ప్రక్రియ చేపట్టారు. జిల్లాకు చెందిన ముగ్గురు వ్యాపారులు టెండరులో పాల్గొన్నారు. ఇప్పటికీ ఇంకా టెండర్లు విప్పలేదు.

ఆలస్యంతో తీవ్ర నష్టం..

చేపపిల్లల పంపిణీలో ఏటా ఆలస్యం జరగడంతో తీవ్రంగా నష్టపోతున్నామని జిల్లాలోని పలువురు మత్స్యకారులు పేర్కొంటున్నారు. ఎండాకాలం వచ్చేసరికి కనీసం చేపలు కిలో బరువు కూడా ఎదగడం లేదు. పిల్లలు పంపిణీ చేసే సమయంలో చాలా చిన్న పరిమాణం గలవి పంపిణీ చేయడంతో సరిగా ఎదగడం లేదు. అరకిలో లోపే ఎదుగుతున్నాయి. దీంతో ఆశించిన లాభాలు రావడం లేదని మత్స్యకారులు వాపోతున్నారు. నాణ్యతతో కూడిన చేపపిల్ల లను అధికారులు సకాలంలో పంపిణీ చేస్తే ఆరు మాసాల్లోపు కిలో వరకు పెరిగే వీలుందని చెబుతున్నారు.

జిల్లాకు 2.84 కోట్లు

జిల్లాలో తొమ్మిది జలాశయాలు ఎల్లంపల్లి ప్రాజెక్టు, ర్యాళ్లవాగు ప్రాజెక్టు, గొల్లవాగు ప్రాజెక్టు, సుంద్సిళ్ల, అన్నారం, నల్లవాగు, నీల్వాయి ప్రాజెక్టు, కుమ్మరివాగు ప్రాజెక్టుతోపాటు దండేపల్లి మండలం పెద్దపేట పెద్దచెరువు, 363 చెరువులు ఉన్నాయి. జిల్లాలో 7,400 మంది మత్స్యకారులు వాటిపై ఆధారపడి జీవనోపాధి పొందుతున్నారు. మత్స్యకారులు చేపపిల్లలు పెంచేందుకు, ప్రభుత్వం ఏటా కోట్ల సంఖ్యలో చేపపిల్లలు పంపిణీ చేస్తోంది. గత ఏడాదిలాగే ఈసారి కూడా జిల్లాకు 2.84 కోట్ల చేపపిల్లలు పంపిణీకి అధికారులు చర్యలు చేపట్టారు. అందులో బొచ్చె, రహు, బంగారుతీగ, మిరిగాల వంటి నాలుగు రకాల చేపపిల్లలను పంపిణీ చేయనున్నట్లు తెలిపారు.

ఆలస్యంతో నష్టం



ప్రభుత్వం పంపిణీ చేస్తున్న చేపపిల్లల పంపిణీలో ప్రతియేటా ఆలస్యం జరుగుతోంది.దీంతో చేపపిల్లలు సరిగా ఎదగడం లేదు. అర కిలో లోపు మాత్రమే ఎదగడంతో ఆశించిన లాభాలు రావడం లేదు. నాణ్యతతో కూడిన చేపపిల్లలు సకాలంలో అందించాలి.

– మెంగు లింగన్న, మత్స్య సహకార సంఘం చైర్మన్, దండేపల్లి

కొంత సమయం పట్టవచ్చు..

జిల్లాలోని చెరువులు, జలాశయాల్లో మత్స్యకారులు చేపలు పెంచుకునేందుకు ప్రభుత్వం పంపిణీ చేయాల్సిన చేపపిల్లలకు సంబంధించిన టెండర్ ప్రక్రియ కొనసాగుతోంది. పూర్తయ్యేందుకు కొంత సమయం పట్టచ్చు. ఈనెలాఖరులోగా, లేదంటే వచ్చే నెలలో చేపపిల్లలు పంపిణీ చేస్తాం.

– భాస్కర్, జిల్లా ఇంచార్జి మత్స్యశాఖ అధికారి

బలహీన వర్గాల ఆశాజ్యోతి బాపూజీ

- జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్
- ఘనంగా 'కొండా' జయంతి

మంచిర్యాలఅగ్రికల్చర్: బడుగు, బలహీన వర్గాల ఆశాజ్యోతి ఆచార్య కొండా లక్ష్మణ్ బాపూజీ అని, జీవిత కాలమంతా వారి సంక్షేమమే పరమావధిగా పని చేశారని జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్ అన్నారు. శుక్రవారం జిల్లా సమీకృత కలెక్టరేట్‌లో కొండా లక్ష్మణ్ బాపూజీ జయంతి సందర్భంగా జిల్లా అదనపు కలెక్టర్ మోతిలాల్, జిల్లా వెనుకబడిన తరగతుల అభివృద్ధి శాఖ అధికారి వినోద్‌కుమార్‌తో కలిసి బాపూజీ చిత్రపటానికి పూలమాల వేసి ఘనంగా నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ తొలి తరం, మలిదశ తెలంగాణ ఉద్యమంతోపాటు అనేక ఉద్యమాల్లో క్రియాశీలకంగా పని చేశారని అన్నారు. ఆయన జీవితం భావితరాలకు ఆదర్శనీయమని కొనియాడారు. 1969లో తెలంగాణ ఉద్యమంలో భాగంగా తన మంత్రి పదవి త్యాగం చేశారని, 2009–12 వరకు సాగిన తెలంగాణ ఉద్యమంలో పాల్గొన్నారని అన్నారు. ఈ కార్యక్రమంలో చిలువేరు సదానందం, సుదర్శన్, గడ్డ సుధాకర్, బండి మల్లిఖార్జున్, దోమల రమేష్, వేముల రమేష్, బీసీ, వివిధ సంఘాల నాయకులు పాల్గొన్నారు.


కొండా లక్ష్మణ్ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులు అర్పిస్తున్న కలెక్టర్ కుమార్ దీపక్

జీవిత చరిత్రను పాఠ్యాంశంగా చేర్చాలి

స్వాతంత్య్ర సమరయోధుడు కొండా లక్ష్మణ్ బాపూజీ జీవిత చరిత్రను పాఠ్యాంశంగా చేర్చాలని కొండా లక్ష్మణ్ బాపూజీ విగ్రహ సాధన కమిటీ, పద్మశాలి సంఘం ఆధ్వర్యంలో కలెక్టర్ కుమార్ దీపక్‌ను కోరారు. మంచిర్యాలలోని ఏదైనా కూడలిలో కాంస్య విగ్రహం, ఆత్మగౌరవ భవనం ఏర్పాటు చేయాలని వినతిపత్రం అందజేశారు. పద్మశాలి సంఘం జిల్లా అధ్యక్షుడు చిలగాని సుదర్శన్, ప్రధాన కార్యదర్శి వెంకటేష్, సలహాదారులు బొడ్డ య్య, నాయకులు చిలుముల అంజయ్య, మల్లికా ర్జున్, నాగేంద్ర బాబు, సాగర్ తదితరులు పాల్గొన్నారు.

అదనపు డీజీపీ ఆకస్మిక తనిఖీలు


అదనపు డీజీపీకి పుష్పగుచ్ఛం అందజేస్తున్న సీపీ


మొక్క నాటి నీరు పోస్తున్న అదనపు డీజీపీ

- బెటాలియన్‌లో పలు విభాగాల పర్యవేక్షణ
- శిక్షణ కానిస్టేబుళ్లతో మాటాముచ్చట

మంచిర్యాలరూరల్(హాజీపూర్): హాజీపూర్ మండలం గుడిపేట 13వ ప్రత్యేక పోలీస్ బెటాలియన్‌ను రాష్ట్ర ప్రత్యేక పోలీస్ బెటాలియన్‌ల అదనపు డీజీపీ సంజయ్‌కుమార్ జైన్ శుక్రవారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఆయనకు రామగుండం పోలీస్ కమిషనర్ శ్రీనివాసులు, మంచిర్యాల డీసీపీ భాస్కర్, ఏసీపీ ప్రకాశ్, బెటాలియన్ కమాండెంట్ పి.వెంకటరాములు పుష్పగుచ్ఛాలు అందజేసి స్వాగతం పలికారు. వార్షిక తనిఖీల్లో భాగంగా ముందుగా బెటాలియన్ ప్రధాన కార్యాలయాన్ని సందర్శించారు. పోలీస్ పరేడ్ మైదానం, ఆయుధ కేంద్రం, బెటాలియన్ పోలీస్‌ల ఆపరేషన్ ప్లాటూన్లను సందర్శించి వివరాలు ఆరా తీశారు. వాహన మరమ్మతుల కేంద్రం, డిస్పెన్సరీ, పెట్రోల్ బంక్, బెటాలియన్‌లో సిద్ధం చేస్తున్న ఫంక్షన్ హాల్‌ను పర్యవేక్షించారు. అనంతరం పోలీస్ శిక్షణ కేంద్రాన్ని పరిశీలించి శిక్షణ కానిస్టేబుళ్లతో మాట్లాడుతూ భోజన వసతిపై ఆరా తీశారు. శిక్షణలో ఉన్నతంగా రాణించి పోలీస్ ఉద్యోగ విధుల్లో బాధ్యతగా రాణించాలని సూచించారు. కమాండెంట్ వెంకటరాములు, అసిస్టెంట్ కమాండెంట్‌లు నాగేశ్వర్‌రావు, కాళిదాసు, ఆర్‌ఐలు, ఏఆర్‌ఎస్సైలు, శిక్షణ కానిస్టేబుళ్లు, సిబ్బంది పాల్గొన్నారు.

నిబంధనలు అమలు చేయాలి


సమావేశంలో మాట్లాడుతున్న జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్, పక్కన జిల్లా అటవీ అధికారి శివ్ ఆశిష్‌సింగ్

- జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్

మంచిర్యాలఅగ్రికల్చర్: కవ్వాల్ అభయారణ్యం పరిధిలో వన్యప్రాణి సంరక్షణ, అటవీ నిబంధనలు పకడ్బందీగా అమలు చేయాలని జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్ అన్నారు. శుక్రవారం సమీకృత కలెక్టరేట్‌లో జిల్లా అటవీ అధికారి శివ్ ఆశిష్ సింగ్ అదనపు కలెక్టర్ మోతిలాల్‌తో కలిసి దండేపల్లి, జన్నారం మండలాల తహసీల్దార్లు, ఎంపీడీవోలు, పంచాయతీ కార్యదర్శులతో అభయారణ్యం పరిధిలో నిబంధనల అమలుపై సమీక్ష సమావేశం నిర్వహించారు. కలెక్టర్ మాట్లాడుతూ సుప్రీంకోర్టు ఆదేశాల మేరకు కనీసం కిలోమీటర్ పరిధి వరకు ఎకో సెన్సిటివ్ జోన్ ఏర్పాటు చేయాలని, పర్యావరణ పరిరక్షణ చట్టం ప్రకారం 10 కిలోమీటర్ల రేడియస్ జోన్ ఏర్పాటు చేయాల్సి ఉంటుందని, ఒక వేళ ఏర్పాటు చేయనట్లయితే డిఫాల్ట్‌గా 10 కిలోమీటర్ల మేర జోన్ పరిధి తీసుకోవడం జరుగుతుందని తెలిపారు. జన్నారం, దండేపల్లి మండలాల్లోని పలు గ్రామాల్లో నిషేధిత వ్యాపార కార్యక్రమాలు, మైనింగ్ కాలుష్య కారక, రసాయన పరిశ్రమలు, ఇసుక తవ్వకాలు వంటివి జరగకుండా చర్యలు తీసుకోవాలని అన్నారు. జిల్లా కలెక్టర్ అధ్యక్షతన మానిటరింగ్ కమిటీ ఏర్పాటు చేసి పర్యవేక్షిస్తామని తెలిపారు.

పర్యాటక రంగ అభివృద్ధికి కృషి

మంచిర్యాలఅగ్రికల్చర్: జిల్లాలో పర్యాటక రంగ అభివృద్ధికి అధికారుల సమన్వయంతో కృషి చేస్తామని జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్ అన్నారు. శుక్రవారం కలెక్టర్ చాంబర్‌లో జిల్లా వ్యవసాయ శాఖ అధికారి కల్పన, జిల్లా యువజన క్రీడ అధికారి కీర్తి రాజ్‌వీరు, లయన్స్ క్లబ్ ప్రతినిధులతో కలిసి ప్రపంచ పర్యాటక దినోత్సవంపై సమావేశం నిర్వహించారు. కవ్వాల్ టైగర్ రిజర్వ్, ఎల్లంపల్లి ప్రాజెక్టు, శివ్వారం మొసళ్ల అభయారణ్యం, గాంధారి ఖిల్లా, పెద్దయ్యగుట్ట ఆలయం, బుగ్గ రాజేశ్వర స్వామి ఆలయం, ఏసీసీ క్వారీ, గూడెం సత్యనారాయణ స్వామి ఆలయం, జలపాతాలు, అనేక పర్యాటక ప్రాంతాలు ఉన్నాయని తెలిపారు. ఉమెన్ ఎంపవర్మెంట్ అధికారి అనిత, లయన్స్ క్లబ్ ప్రతినిధులు కట్కూరి సత్యనారాయణ, రాజన్న పాల్గొన్నారు.

శాస్త్రీయ అవగాహన, సందేశానికి సైన్స్‌డ్రామా



మాట్లాడుతున్న డీఈవో యాదయ్య

మంచిర్యాలఅర్బన్: శాస్త్రీయంగా అవగాహన కల్పించడానికి, సందేశాలు ఇవ్వడానికి సైన్స్ డ్రామా ఎంతో ఉపయోగపడుతుందని డీఈవో యాదయ్య అన్నారు. శుక్రవారం జిల్లా సైన్స్ కేంద్రంలో సైన్స్ డ్రామా పోటీలు నిర్వహించారు. మానవజాతి ప్రయోజనం సైన్స్, టెక్నాలజీ అనే అంశంతోపాటు ఉప అంశాలుగా ప్రపంచ నీటి సంక్షోభం, ఆర్టిఫీషియల్ ఇంటెలిజెన్స్, సోషైటీ, విపత్తులను అరికట్టడం కోసం ఆధునిక సాంకేతికలు ఆరోగ్య, పరిశుభ్రత, వాతావరణ మార్పు–ప్రభావంపై విద్యార్థులు ప్రదర్శించిన 12 నాటికలు అలరించాయి. ప్రథమ, ద్వితీయ విజేతలను ప్రకటించారు. 'ప్రపంచంలో నీటి కొరత' నాటకం ప్రదనర్శనతో కాసిపేట ఆదర్శ పాఠశాల విద్యార్థులు మొదటి స్థానంలో నిలిచి రాష్ట్ర స్థాయికి ఎంపికయ్యారు. ఆర్టిఫిషియల్ ఇంటెలెజెన్స్ కొత్త శకం నాటకంతో సబ్బెపల్లి జిల్లా పరిషత్ సెకండరీ పాఠశాల విద్యార్థులు ద్వితీయ స్థానంలో నిలిచారు. వీరికి కన్సోలేషన్ బహుమతి అందజేశారు. న్యాయనిర్ణేతలుగా సత్యానారాయణ, దత్తకుమార్, జనార్దన్, శ్రీనివాస్, వెంకటేశ్వరరావు, అర్చన వ్యవహరించారు. ఈ కార్యక్రమంలో జిల్లా సైన్స్ అధికారి మధుబాబు పాల్గొన్నారు.

వృద్ధుల సంక్షేమానికి ప్రభుత్వం కృషి

మంచిర్యాలటౌన్: వృద్ధుల సంక్షేమానికి ప్రభుత్వం కృషి చేస్తోందని, పలు పథకాలు అమలు చేస్తోందని, వృద్ధులు వారికి ఉన్న హక్కులను సద్వినియోగం చేసుకోవాలని జిల్లా అదనపు కలెక్టర్ మోతిలాల్ అన్నారు. అంతర్జాతీయ వయోవృద్ధుల దినోత్సవాన్ని పురస్కరించుకుని జిల్లా మహిళా, శిశు, దివ్యాంగులు, వయోవృద్ధుల సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో శుక్రవారం జిల్లా కేంద్రంలోని ఫ్లైఓవర్ బ్రిడ్జి వద్ద ర్యాలీని జిల్లా అదనపు కలెక్టర్ జెండా ఊపి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వయోవృద్ధులకు ప్రత్యేక హక్కులు, చట్టాలు ఉన్నాయని, వాటిపై ప్రతి ఒక్కరూ అవగాహన కలిగి ఉండాలని అన్నారు. ఇంచార్జి జిల్లా సంక్షేమ శాఖ అధికారి జి.స్వరూపరాణి, సీడీపీవో రేష్మ, చందన, రెస్పాన్స్ ఆఫీసర్ ఎండీ ఫర్జానా బేగం, కోఆర్డినేటర్ సౌజన్య, అంగన్‌వాడీ టీచర్లు పాల్గొన్నారు.


ర్యాలీని ప్రారంభిస్తున్న అదనపు కలెక్టర్

కొనసాగుతున్న అక్రమ నిర్మాణాల తొలగింపు

మందమర్రిరూరల్: పట్టణంలోని మార్కెట్ ఏరియాలో దుకాణ సముదాయాల వెనుక మురికి కాలువలపై చేపట్టిన అక్రమ నిర్మాణాల తొలగింపు పనులు కొనసాగుతున్నాయి. మూడు రోజులు గడువు ఇచ్చిన మున్సిపల్ అధికారులు శుక్రవారం అక్రమ నిర్మాణాలను కూల్చేశారు. తొలగింపు పనులు నిలిపి వేసేది లేదని, అక్రమ నిర్మాణాలను యజమానులు తొలగించుకోవాలని, లేనిపక్షంలో మున్సిపల్ సిబ్బంది ద్వారా తొలగిస్తామని మున్సిపల్ కమిషనర్ వెంకటేశ్వర్లు తెలిపారు.

ఊర చెరువు సర్వే ప్రారంభం

మందమర్రిరూరల్: మున్సిపల్ పరిధిలోని ఊర చెరువు శిఖం సర్వేను ఇరిగేషన్, రెవెన్యూ శాఖల అధికారులు శుక్రవారం ప్రారంభించారు. ఇరిగేషన్ డీఈ శారద, ఏఈ రమ్య, రెవెన్యూ సర్వే అధికారి కృష్ణ, రెవెన్యూ ఇన్‌స్పెక్టర్ గణపతి సర్వే చేశారు. తహసీల్దార్ సతీష్‌కుమార్ మాట్లాడుతూ ఊర చెరువు శిఖం సరిహద్దుల విషయమై ఇరిగేషన్ శాఖ అధికారులు కోరడంతో ఇరిగేషన్, రెవెన్యూ సిబ్బంది ఆధ్వర్యంలో సర్వే చేపట్టినట్లు తెలిపారు.


అక్రమ నిర్మాణాలను తొలగిస్తున్న సిబ్బంది

క్లుప్తంగా

చికిత్స పొందుతూ యువకుడి మృతి


బెడద కార్తీక్(ఫైల్)

మంచిర్యాలరూరల్ (హాజీపూర్): హాజీపూర్ మండలం పెద్దంపేట గ్రామానికి చెందిన బెడద కార్తీక్(28) చికిత్స పొందుతూ శుక్రవారం మృతిచెందాడు. హాజీపూర్ ఎస్సై గోపతి సురేశ్, గ్రామస్తులు తెలిపిన వివరాల ప్రకారం.. కార్తీక్ మూడేళ్లుగా పత్తి వ్యాపారం చేస్తున్నాడు. రెండేళ్లుగా ఆన్‌లైన్‌లో బెట్టింగ్‌కు బానిసగా మారి తీవ్రంగా నష్టపోయాడు. అప్పులు ఇచ్చినవారు ఒత్తిడి తేవడంతో ఓసారి పురుగుల మందు తాగి ప్రాణాలతో బయటపడ్డాడు. మళ్లీ కొన్ని రోజులకు అప్పులు చేసి రూ.3 లక్షల నుంచి రూ.4లక్షలు బెట్టింగ్‌లో పోగొట్టుకున్నాడు. అప్పులు ఇచ్చిన వాళ్లు ఇంటికి వచ్చి అడుగడంతో తల్లిదండ్రులు లలిత, అంజయ్య కార్తీక్‌ను మందలించారు. దీంతో ఈ నెల 13న కార్తీక్ గడ్డి మందు తాగాడు. హైదరాబాద్‌లోని ఆస్పత్రిలో చికిత్స అనంతరం, స్థానిక ప్రభుత్వ ఆస్పత్రిలో చికిత్స పొందుతూ పరిస్థితి విషమించి శుక్రవారం చనిపోయాడు. మృతుడికి భార్య స్రవంతి, కూతుళ్లు లిప్సిక, లాస్య ఉన్నారు. మృతుడి తండ్రి ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నామని ఎస్సై సురేశ్ తెలిపారు.

రోడ్డు ప్రమాదంలో ఒకరు..


తిరుపతి (ఫైల్)

మంచిర్యాలరూరల్ (హాజీపూర్): రోడ్డు ప్రమాదంలో ఒకరు మృతి చెందినట్లు ఎస్సై గోపతి సురేశ్ తెలిపారు. ఆయన కథనం ప్రకారం.. మండలంలోని కర్ణమామిడి గ్రామానికి చెందిన వడ్డేపల్లి తిరుపతి (41) గురువారం బైక్‌పై మంచిర్యాలకు వెళ్లి రాత్రి ఇంటికి తిరుగుపయనయ్యాడు. గుడిపేట శివారులోని జాతీయ రహదారిపై ఎలాంటి ప్రమాద సూచిక లేకుండా నిలిపి ఉంచిన లారీ చీకట్లో కనిపించకపోవడంతో వేగంగా ఢీకొట్టాడు. తీవ్రగాయాలైన ఆయన్ను వెంటనే 108 ద్వారా మంచిర్యాల ప్రభుత్వ ఆస్పత్రికి తరలించగా అప్పటికే మృతిచెందినట్లు వైద్యులు నిర్ధారించారు. మృతుడి భార్య స్నేహలత ఫిర్యాదుతో కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు. మృతుడికి ఇద్దరు కుమారులు ఉన్నారు.

ప్రమాదవశాత్తు చెరువులో పడి..

తానూరు: ప్రమాదవశాత్తు చెరువులో పడి ఒకరు మృతిచెందినట్లు ఎస్సై డి.రమేశ్ తెలిపారు. ఆయన కథనం ప్రకారం.. మండలంలోని మహలింగి గ్రామానికి చెందిన తురాటి విఠల్ (35) శుక్రవారం ఉదయం 7 గంటలకు కాలకృత్యాలు తీర్చుకునేందుకు చెరువు వద్దకు వెళ్లాడు. ప్రమాదవశాత్తు కాలుజారిపడి చెరువు నీటిలో మునిగి మృతిచెందాడు. భార్య రాణి ఫిర్యాదుతో కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

చికిత్స పొందుతూ బాలిక..

బోథ్: తీవ్ర జ్వరంతో బాధపడుతున్న బాలిక చికిత్స పొందుతూ మృతిచెందింది. వివరాలు ఇలా ఉన్నాయి..మండలంలోని సొనాల గ్రామానికి చెందిన అందె సహస్ర (14)కు గతవారం రోజులుగా తీవ్ర జ్వరంతో బాధపడుతోంది. కుటుంబీకులు ఇటీవల బోథ్ సీహెచ్‌సీ ఆసుపత్రికి తీసుకెళ్లారు. అక్కడి నుంచి నిర్మల్ జిల్లా కేంద్రానికి తరలించగా వైద్యులు హైదరాబాద్‌కు రెఫర్ చేశారు. యశోద ఆసుపత్రిలో నాలుగు రోజుల చికిత్స అనంతరం శుక్రవారం మృతిచెందింది. బాలిక మృతితో గ్రామంలో విషాదఛాయలు అలుముకుంది.

నిర్లక్ష్యానికి నెలవు..ట్రిపుల్‌ఐటీ

- అంతటా భద్రతా వైఫల్యం
- లోపాల కారణంగానే ఘటనలు
- పట్టింపులేని అధికారులు


బాసర ట్రిపుల్‌ఐటీ

భైంసా: రెగ్యులర్ వీసీ లేకపోవడం..ఉన్నతాధికారుల పర్యవేక్షణ కొరవవడం..సిబ్బందిలో తీవ్ర నిర్లక్ష్యం అడుగడుగునా భద్రతా వైఫల్యం ఫలితంగా బాసర ట్రిపుల్ ఐటీలో ఏదో ఒక సమస్య బయటకు వస్తూనే ఉంది. గత నాలుగేళ్ల క్రితం ఏకంగా అసిస్టెంట్ ప్రొఫెసర్ లైంగిక వేధింపుల ఉదంతం ట్రిపుల్‌ఐటీలో లోపాలను బట్ట బయలుచేసింది. ఓ అసిస్టెంట్ ప్రొఫెసర్ అక్కడి క్యాంపస్ అధికారుల నిర్లక్ష్యాన్ని తనకు అనుకూలంగా మలుచుకుని అప్పట్లో తన చాంబర్‌ను ఏకంగా విద్యార్థినుల వసతి గృహంలో కేటాయించేలా చేసుకోవడం పట్ల అప్పట్లో విమర్శలు వచ్చాయి. ఆ అసిస్టెంట్ ప్రొఫెసర్ ఏకంగా లైంగిక వేధింపుల ఉదంతం భద్రతా నిర్లక్ష్యానికి నిలువెత్తు సాక్ష్యమైంది. అప్పట్లో బాసర ట్రిపుల్ ఐటీలో జవాబు పత్రాలకు రెక్కలు వచ్చి యథేచ్ఛగా బయటకు వచ్చి వాటిలో దిద్దుబాటు చేసి మళ్లీ లోపలికి పంపించి చదువులో వెనుకబడిన వారికి సైతం మంచి మార్కులు వచ్చే విధంగా చేసిన ఆరోపణలపై ఇప్పటికీ ఎలాంటి స్పష్టత రాలేదు. ఇలా ట్రిపుల్ ఐటీలో నిర్లక్ష్యం పట్ల అధికారులు ఎందుకు మౌనం వహిస్తున్నారో తెలియడం లేదు. ఆ విషయాన్ని ఇప్పుడిప్పుడే మరిచిపోతున్నారంటే ఏదో ఒక సంఘటన జరుగుతూ భద్రతా వైఫల్యాన్ని చూయిస్తుంది.

ఆంక్షల కోసమే..

ట్రిపుల్‌ఐటీలో సెక్యూరిటీ గార్డులు ఉన్నా వారందరినీ ఆంక్షల కోసమే విధులు కేటాయిస్తున్నట్లు తెలుస్తోంది. మీడియాను, విద్యార్థి, ప్రజాసంఘాలు, ప్రతిపక్షాల కదలికపైనే ఇక్కడి భద్రతా విభాగం పనిచేస్తున్నట్లు స్పష్టమవుతుంది. ఈ రహస్య క్యాంపస్‌లో ఏమి జరిగిన బయటవారికి తెలియకుండా జాగ్రత్తపడడమే వీరి విధులు అన్నట్లు కనిపిస్తుంది. ఇక విద్యార్థుల భద్రతకంటే ఇక్కడి విషయాలు బయటకు ఎవరూ చేరవేస్తున్నారో అనే వివరాలు కనిపెట్టేందుకే పనిచేస్తున్నట్లు కనిపిస్తుంది. భద్రతా వైఫల్యంతో విద్యార్థులు ఇబ్బందులు పడుతుంటే మరోవైపు ప్రధాన ద్వారం వద్ద ఎవరిని లోనికి అనుమతించకుండా అధికారులు చేస్తున్న అతిపై తీవ్ర విమర్శలు వస్తున్నాయి. ఇప్పటికైనా జిల్లాస్థాయి ఉన్నతాధికారులు స్పందించి ట్రిపుల్‌ఐటీపై దృష్టిసారించాలని అంతా కోరుతున్నారు.

లెక్కల్లోనే భద్రత..

ట్రిపుల్ ఐటీలో 110 మంది సెక్యూరిటీ గార్డులు ఉన్నారు. సీఐ పోస్టును కేటాయించి భద్రతపై పోలీసు అధికారులు దృష్టిసారించారు. బాసర ట్రిపుల్ ఐటీ ప్రధాన ద్వారం నుంచి అకాడమిక్ బ్లాక్‌లు, ప్రధాన మార్గాలు, వసతిగృహాలు, కార్యాలయాలు ఇలా అన్నిచోట్ల సెక్యూరిటీ గార్డులు కనిపిస్తారు. లెక్కల్లోనే ఈ సిబ్బంది ఉన్న ఎంతమంది పనిచేస్తారన్నది ప్రత్యేకంగా చెప్పాల్సిన అవసరం లేదు. ఇక లోపల జరుగుతున్న విషయాలు బయటకు రాని వ్వకపోవడమే అసలు విధులు అనే విధంగా అధికారులు పనిచేస్తున్నారు. ప్రధాన ద్వారంతోపాటు అన్నిచోట్ల సిబ్బంది ఉన్నప్పటికీ ఎక్కడ కూడా ఏమి జరుగుతుందో తెలుసుకోలేని పరిస్థితి ఉంది.

అన్ని లోనికే..

బాసర ట్రిపుల్‌ఐటీలో 9 వేల మందికిపైగా విద్యార్థులు చదువుతున్నారు. గతంలో డీఎస్పీ, సీఐ, ఎస్సైతోపాటు పది మంది పోలీసులు, వంద మంది సెక్యూరిటీ గార్డులు ఉండేవారు. ప్రస్తుతం ఒక సీఐ పర్యవేక్షణలోనే భద్రతను కట్టుదిట్టం చేస్తున్నారు. ఇక ట్రిపుల్ ఐటీలో ప్రైవేటు సెక్యూరిటీ గార్డులు ఉన్నప్పటికీ గంజాయి, మద్యం, సిగరేట్లు లోనికి యథేచ్ఛగా వస్తున్నాయి. ఇక్కడి స్టోర్‌లలో పనిచేసే ప్రైవేటు సిబ్బంది వీటిని లోనికి తెచ్చి ఇస్తున్నట్లు సమాచారం. ఈ విషయం తెలిసినా అధికారులు చర్యలు తీసుకోవడం లేదు. ఇటీవల ఇద్దరు విద్యార్థులు గోడ దూకి బయటకి వెళ్లిపోయారు. వీరిపై చర్యలకు క్యాంపస్ అధికారులు ఉపక్రమించారు. గతేడాది కోసం ఓ విద్యార్థిని కోసం గోడ దూకి మరో యువకుడు లోపలకు వచ్చాడు. ఇటీవలే క్యాంపస్‌లో గణేశ్ నిమజ్జన వేడుకల్లో గొడవలు జరిగాయి. ఇలా ట్రిపుల్‌ఐటీలో ఏదో ఒక సంఘటన జరుగుతూనే ఉంది.

ట్రిపుల్‌ఐటీలో ముగిసిన స్మార్ట్‌గ్రిడ్


పాల్గొన్న విద్యార్థులు, అధ్యాపకులు

భైంసా: బాసర ట్రిపుల్‌ఐటీలో ఎలక్ట్రికల్ ఇంజనీరింగ్ విభాగంలో వారంపాటు నిర్వహించిన స్మార్ట్‌గ్రిడ్ కార్యక్రమం శుక్రవారంతో ముగిసింది. పునరుత్పాదకశక్తి వనరులపై ఈ సదస్సు ఏర్పాటు చేశారు. ఉన్నత విద్యలో వస్తున్న మార్పులు, అనుసరించాల్సిన విధానాలను చర్చించారు. సైబర్ సెక్యూరిటీ, బిగ్‌డేటా అనాలిటిక్స్, పవర్‌క్వాలిటీ, రియల్‌టైమ్ సిమ్యూలేషన్ సిస్టం అంశాలపై విద్యార్థులు, అధ్యాపకులు చర్చించారు. ఇంజనీరింగ్ అసోసియేట్ మహేశ్, హెచ్‌ఓడీ బాపుసింగ్‌పాల్గొన్నారు.

జాతీయ స్థాయి పోటీలకు ఎంపిక

జైపూర్: మండల కేంద్రంలోని గురుకులం బీపీసీ సెకండియర్ విద్యార్థి కోటారి రఘు జాతీయ స్థాయి హ్యాండ్‌బాల్ పోటీలకు ఎంపికయ్యాడు. వచ్చేనెల 3, 7వ తేదీల్లో హైదరాబాద్‌లో జరిగే సబ్ జూనియర్ బాయ్స్ నేషనల్ హ్యాండ్‌బాల్ చాంపియన్‌షిప్ పోటీల్లో రాష్ట్ర జట్టుకు ప్రాతినిధ్యం వహించనున్నాడు. శుక్రవారం విద్యార్థిని కళాశాలలో ప్రిన్సిపాల్ నాగేశ్వర్‌రావు, వైస్ ప్రిన్సిపాల్ కమలాకర్, పీఈటీలు సంతోష్, వెంకటేష్ అభినందించారు.

కార్మికుల హక్కులను పరిరక్షిస్తాం

- ఐఎన్టీయూసీ ఉపాధ్యక్షుడు శంకర్‌రావు


కార్మికులతో మాట్లాడుతున్న శంకరావు

శ్రీరాంపూర్: సింగరేణి కార్మికుల హక్కుల పరిరక్షణ కోసమే ఐఎన్టీయూసీ పనిచేస్తోందని ఆ యూనియన్ శ్రీరాంపూర్ బ్రాంచి ఉపాధ్యక్షుడు జట్టి శంకర్‌రావు తెలిపారు. యూనియన్ ఆధ్వర్యంలో ఆర్కే న్యూటెక్ గనిని శుక్రవారం సందర్శించి కార్మికుల సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సింగరేణి గడిచిన ఆర్థిక సంవత్సరం సాధించిన లాభాల నుంచి 33 శాతం వాటాను కార్మికులకు ఇప్పించామన్నారు. దీన్ని జీర్ణించుకోలేని కొన్ని కార్మిక సంఘాలు కావాలని లాభాల వాటాపై తప్పుడు ప్రచారం చేస్తున్నాయని మండిపడ్డారు. టీబీజీకేఎస్ హయాంలో ఏ విధంగా లాభాలు చూపెట్టారో అదేవిధంగా లాభాలను పరిగణనలోకి తీసుకుని వాటాను మరో శాతం పెంచి ఇప్పిస్తున్నామన్నారు. కార్మికుల వేతనాల నుంచి కోత లేకుండా వరద బాధితులకు సింగరేణి లాభాల నుంచే రూ.10.25 కోట్లు విరాళంగా ఇప్పించడంలో యూనియన్ కీలకపాత్ర పోషించిందన్నారు. యూనియన్ కేంద్ర ఉపాధ్యక్షుడు కలవేన శ్యామ్, జాతీయ సమితి సభ్యుడు భీమ్‌రావు, యూనియన్ డిప్యూటీ జనరల్ సెక్రెటరీలు గరిగస్వామి, ఐరెడ్డి తిరుపతిరెడ్డి, నాయకులు ఎల్.శ్రీనివాస్, వెంకటేశ్వర్లు, సత్యనారాయణ, అశోక్, బి.రవి, మహేందర్, మణిదీప్, సదయ్య పాల్గొన్నారు.

బకాయిలు వెంటనే చెల్లించాలి


కార్మికులతో మాట్లాడుతున్న ఏఐటీయూసీ నేతలు

శ్రీరాంపూర్: సింగరేణి సంస్థకు రాష్ట్ర ప్రభుత్వం బకాయి ఉన్న డబ్బులను వెంటనే చెల్లించాలని గుర్తింపు సంఘం ఏఐటీయూసీ నాయకులు డిమాండ్ చేశారు. ఎస్ఆర్పీ 3, 3ఏ గనిలో శుక్రవారం గేట్‌మీటింగ్ నిర్వహించారు. ఈ సందర్భంగా యూనియన్ డెప్యూటీ ప్రధాన కార్యదర్శులు కె.వీరభద్రయ్య, ఎం.సమ్మయ్య, బ్రాంచి కార్యదర్శి ఎస్కే బాజీసైదా మాట్లాడారు. సింగరేణికి బకాయిలు చెల్లించకపోవడం వల్ల సంస్థ ముున్ముందు ఆర్థికంగా గడ్డు పరిస్థితులను ఎదుర్కోనుందన్నారు. బీఆర్ఎస్ ప్రభుత్వంలో పేరుపోయిన బకాయిలు కాంగ్రెస్ వచ్చాక తర్వాత తీరుస్తాయని అనుకుంటే ఇంకా పెరుగుతున్నా యన్నారు. ఇప్పటికి రూ.32 వేల కోట్ల బకాయిలు ఉన్నాయని తెలిపారు. సింగరేణి లాభాలపై కొన్ని కార్మిక సంఘాలు చేస్తున్న తప్పుడు ప్రచారాన్ని కార్మికులు నమ్మవద్దన్నారు. యూనియన్ బ్రాంచి సహాయ కార్యదర్శి మోత్కూరి కొమురయ్య, ఫిట్ కార్యదర్శి మురళీ చౌదరి, కాంట్రాక్ట్ వర్కర్స్ యూనియన్ బెల్లంపల్లి రీజియన్ కార్యదర్శి అఫ్రోజ్‌ఖాన్, నాయకులు తవటం మల్లేశ్, అంబాల రవి, రామోజీ, సారయ్య, ప్రభాకర్ తదితరులు పాల్గొన్నారు.

గూడెంలో పట్టపగలే చోరీ


చోరీ తీరును పరిశీలిస్తున్న సీఐ, ఎస్సై

దండేపల్లి: మండలంలోని గూడెంలో శుక్రవారం పట్టపగలే దొంగలు ఓ ఇంట్లో చోరీకి పాల్పడ్డారు. వివరాలు ఇలా ఉన్నాయి.. గూడెం శ్రీసత్యనారాయణస్వామి ఆలయ కొండకు సమీపంలో గల చుంచు సురేశ్ దంపతులు ఇంటికి తాళం వేసి పని నిమిత్తం బయటికి వెళ్లారు. మధ్యాహ్నం వచ్చేసరికి వెనక ఉన్న తలుపు తాళం పగలగొట్టి ఉంది. బీరువాలో మూడు తులాల బంగారు ఆభరణాలను దొంగలు ఎత్తుకెళ్లారని బాధితుడు తెలిపాడు. సమాచారం అందుకున్న లక్సెట్టిపేట సీఐ నరేందర్, దండేపల్లి ఎస్సై ఉదయ్‌కిరణ్ ఘటన స్థలానికి చేరుకున్నారు. క్లూస్‌టీంను రప్పించి చోరీ తీరును పరిశీలించారు. బాధితుడు ఫిర్యాదుతో కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై పేర్కొన్నారు.

ఆరుగురు బైండోవర్

నెన్నెల: మండల కేంద్రంలో శుక్రవారం ఆరుగురిని బైండోవర్ చేసినట్లు ఎస్సై ప్రసాద్ తెలిపారు. మండల కేంద్రంలో గురువారం గంజాయి సేవిస్తూ పట్టుబడిన 8 మందిలో నుంచి ఆరుగురిని తహసీల్దార్ రమేశ్ ఎదుట హాజరుపర్చి బైండోవర్ చేసినట్లు వివరించారు.

ఒకరి బైండౌన్..

నెన్నెల మండలంలో మరొకరిని బైండౌన్ చేశారు. బెల్లంపల్లి మండలం దుగినేపల్లికి చెందిన చల్లూరి రమాకాంత్ గతంలో దొంగతనం కేసులో బైండోవర్ చేయగా అతను బైండోర్ నిబంధనలు ఉల్లంఘించి తాజాగా గురువారం గంజాయి సేవిస్తూ పట్టుబడ్డాడు. దీంతో రమాకాంత్‌ను తహసీల్దార్ రమేశ్ ఎదుట హాజరుపర్చి బైండౌన్ చేసినట్లు ఎస్సై వివరించారు.

రాష్ట్రస్థాయి పోటీల్లో సత్తాచాటాలి


ఉమ్మడి జిల్లా జట్లకు ఎంపికైన క్రీడాకారులు

రెబ్బెన(ఆసిఫాబాద్): రాష్ట్రస్థాయి పోటీల్లో జిల్లా క్రీడాకారులు సత్తా చాటాలని బెల్లంపల్లి ఏరియా ఎస్‌వోటూ జీఎం రాజమల్లు అన్నారు. గోలేటి టౌన్‌షిప్‌లోని సింగరేణి ఉన్నత పాఠశాల క్రీడామైదానంలో శుక్రవారం బాల్‌బ్యాడ్మింటన్ అండర్-19 ఉమ్మడి జిల్లా జట్ల ఎంపిక పోటీలు నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ జిల్లా క్రీడాకారులు ఆట్లో గెలుపోటములు సమానంగా తీసుకోవాలన్నారు. కైరిగూడ పీవో నరేందర్, ఏఐటీయూసీ గోలేటి బ్రాంచి కార్యదర్శి ఎస్.తిరుపతి, నాయకులు పాల్గొన్నారు.

ఎంపికైన క్రీడాకారులు

ఉమ్మడి జిల్లా బాలుర జట్టుకు పి.సాయిచరణ్, సీహెచ్ గోపాలక్రిష్ణ, డి.ప్రేమ్‌దీప్, డి.సిద్దార్థ, సీహెచ్ నిఖిల్, కె.అక్షిత్, ఏ.అఖిల్, టి.రుద్రధృవ, నందం, ఆర్.అక్షయ్ కోచ్‌గా నరేశ్, మేనేజర్‌గా మల్లేశ్ ఎంపికయ్యారు. అలాగే బాలికల జట్టుకు టి.ప్రజ్వల శ్రీ, ఎస్.సాయి శ్రీవర్షిణి, ఎం.సహాస్ర, కె.శ్రీ స్ఫూర్తి కారుణ్య, డి.వేరోనిక, డి.నవ్య, టి.ఝాన్సీ, సీహెచ్ లక్ష్మి, కోచ్‌గా గోపాల్, మేనేజర్‌గా కె.భాస్కర్ ఎంపికయ్యారు. ఈ పోటీలకు ఎంపికైన క్రీడాకారులు అక్టోబర్ 4 నుంచి 6 వరకు కామారెడ్డిలో జరిగే రాష్ట్రస్థాయి పోటీల్లో పాల్గొంటారని అసోసియేషన్ సభ్యులు తెలిపారు.

వృద్ధురాలి ఆత్మహత్యాయత్నం


వృద్ధురాలి కుటుంబీకులతో మాట్లాడుతున్న సీఐ సైదారావు

ఖానాపూర్: పట్టణానికి చెందిన వృద్ధురాలు గోదావరిలో దూకి ఆత్మహత్యకు యత్నించింది. సీఐ సైదారావు కథనం ప్రకారం.. సుభాష్‌నగర్ కాలనీకి చెందిన వృద్ధురాలు బోదాసు సాయవ్వ ఆర్థిక ఇబ్బందులు, ఇతర సమస్యలతో సతమతమవుతుంది. ఈ క్రమంలో శుక్రవారం గోదావరిలో దూకగా, అక్కడే చేపలు పడుతున్న జాలర్లు చూసి ఆమెను కాపాడారు. డయల్ 100కు సమాచారం అందించడంతో బ్లూకోల్ట్స్ సిబ్బంది తిరుపతి, రాజేశ్వర్ అక్కడికి చేరుకుని వృద్ధురాలిని పోలీస్‌స్టేషన్‌కు తరలించారు. వృద్ధురాలి కుటుంబీకుల సమక్షంలో కౌన్సెలింగ్ ఇచ్చామని సీఐ తెలిపారు. క్షణికావేశంలో ఎవరూ అఘాయిత్యాలకు పాల్పడవద్దన్నారు.

ధర్మారంలో వివాహిత ..


చికిత్స పొందుతున్న జ్యోతి

మంచిర్యాలక్రైం: థైరాయిడ్ మాత్రలు మింగి వివాహిత ఆత్మహత్యాయత్నానికి పాల్పడిన ఘటన హాజీపూర్ మండలంలో చోటుచేసుకుంది. కుటుంబీకులు తెలిపిన వివరాలు.. ధర్మారం గ్రామానికి చెందిన జ్యోతి ఆమె భర్త మరో మహిళతో సహజీవనం చేస్తున్నాడు. దీంతో జ్యోతి..పోలీసులను ఆశ్రయించింది. పది నెలలుగా పోలీస్‌స్టేషన్ చుట్టూ తిరిగినా ఫలితం లేకపోయింది. దీంతో తీవ్ర మనస్తాపం చెందిన ఆమె ఇంట్లో శుక్రవారం థైరాయిడ్ మాత్రలు మింగింది. గమనించిన కుటుంబీకులు ప్రభుత్వ ఆస్పత్రికి తరలించి చికిత్స అందిస్తున్నారు. ఈ విషయమై మహిళా పోలీస్‌స్టేషన్ సీఐ నరేశ్‌ను సంప్రదించగా, సదరు మహిళ కేసు పెట్టమంటే పెట్టడం లేదన్నారు. కుటుంబ సభ్యులను పిలిపించి కౌన్సెలింగ్ ఇచ్చామన్నారు.

గేదెల పైనుంచి దూసుకెళ్లిన ఆర్టీసీ బస్సు

ఆదిలాబాద్‌టౌన్: పట్టణంలోని తెలంగాణ చౌక్‌లో శుక్రవారం రాత్రి గేదెల పైనుంచి ఆర్టీసీ బస్సు దూసుకెళ్లింది. ఘటన స్థలంలో రెండు గేదెలు మృత్యువాత పడ్డాయి. గమనించిన స్థానికులు ఆర్టీసీ బస్సును ఆపే ప్రయత్నం చేయగా డ్రైవర్ బస్సును ఆపకుండా అక్కడి నుంచి తీసుకెళ్లిపోయాడు. స్థానికులు ఆదిలాబాద్ ఆర్టీసీ డీఎం కల్పనకు ఫోన్ ద్వారా బస్సు నంబర్ తెలియజేయగా, ఈ బస్సు నిర్మల్ జిల్లాకు చెందినదిగా పేర్కొన్నారు. ఘటన వివరాలను నిర్మల్ డీఎం దృష్టికి తీసుకెళ్లినట్లు వివరించారు.

దాడి కేసులో మరో ఇద్దరు అరెస్టు

మంచిర్యాలక్రైం: జిల్లాకేంద్రంలో కాంగ్రెస్ నాయకుడు జగన్మోహన్‌రావు వద్ద పనిచేస్తున్న సూపర్‌వైజర్ మేర సంజీవ్‌పై ఈనెల 23న అర్ధరాత్రి జరిగిన దాడి కేసులో మరో ఇద్దరిని శుక్రవారం అరెస్టు చేసినట్లు సీఐ బన్సిలాల్ తెలిపారు. వారి వద్ద నుంచి రెండు సెల్‌ఫోన్లు, ఒక కత్తి, ఆటోమేటిక్ ఐరన్ స్టిక్ స్వాధీనం చేసుకుని, నిందితులు పోచంపల్లి సంపత్, కాతం రమేశ్‌లను రిమాండ్‌కు తరలించామన్నారు. ఈ కేసులో ఇప్పటికే ఐదుగురిని అరెస్టు చేశామన్నారు.

మెరుగైన విద్యనందించాలి

- ఐటీడీఏ పీవో ఖుష్బూ గుప్తా
- ఆశ్రమ బాలికల పాఠశాల తనిఖీ


విద్యార్థినులకు ప్రశ్నలు వేస్తున్న ఖుష్బూ గుప్తా

ఇంద్రవెల్లి: విద్యార్థినులకు మెరుగైన విద్యనందించాలని ఐటీడీఏ పీవో ఖుష్బూ గుప్తా అన్నారు. మండల కేంద్రంలోని ఆశ్రమ బాలికల పాఠశాలను శుక్రవారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఉపాధ్యాయుల హాజరుపట్టిక, స్టాక్ రిజిస్టర్‌ను పరిశీలించారు. విద్యార్థినులకు అందిస్తున్న విద్య, వైద్యం, భోజనం గురించి అడిగి తెలుసుకున్నారు. తరగతి గదులకు వెళ్లి పాఠ్యాంశాలపై విద్యార్థినులకు ప్రశ్నలు వేసి జవాబు రాబట్టారు. ఉపాధ్యాయులు సులభపద్ధతిలో విద్యాబోధన చేయాలని సూచించారు. మెనూ ప్రకారం భోజనం అందించాలన్నారు. వంటగది, స్టోర్ రూమ్, తాగునీరు, మరుగుదొడ్డి శుభ్రంగా ఉండేలా చూడాలన్నారు. ఆమె వెంట ట్రెయినీ కలెక్టర్ అజ్మీర సంకేత్‌కుమార్, ఉపాధ్యాయులు, విద్యార్థినులు ఉన్నారు.

రాష్ట్రకూట భైరవ విగ్రహం గుర్తింపు

కుంటాల: కుంటాల ఇలవేల్పు గజ్జలమ్మ ఆలయ తూర్పున 9వ శతాబ్దపు రాష్ట్రకూట భైరవ విగ్రహాన్ని శుక్రవారం గుర్తించినట్లు ప్రముఖ కవి, చరిత్ర పరిశోధకుడు డాక్టర్ తుమ్మల దేవరావు తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ క్రీస్తుశకం 6వ శతాబ్దానికి చెందిన రాష్ట్రకూట రాజు ఈ విగ్రహాన్ని చెక్కించినట్లు తెలిపారు. నిర్మల్ జిల్లా రాష్ట్రకూట రాజు రెండవ కృష్ణుని ఏలుబడిలో దిలావర్‌పూర్‌లో వెలుగులోకి వచ్చిన శాసనం వల్ల తెలిసిందన్నారు. కుంటాలలో భైరవ విగ్రహం పెద్ద దమిల్లా జట ఘాటం, పెద్ద కుండలాలు, కర్ణ ఆభరణాలు, మెడలో హారం, నిజహస్తాలతో కత్తి, రక్తంతో కూడిన పాత్ర, కాపాల జంధ్యం, దండకం, ఢమరుకం, ముంజేతు కంకణం, మొలతాడు త్రీ భంగిమలో వైతస్థికపాద భంగిమలో ఉండి కాళ్ల కింద స్వర్ణ వాహనం ఉంది. వీటిని పరిశీలిస్తే అష్ట భైరవుల్లో కాలభైరవునిగా గుర్తించినట్లు దేవరావు తెలిపారు. ఆయన వెంట రాజేశ్వర్ రెడ్డి, సుజాత ఉన్నారు.

ఎస్టీపీపీలో విధులకు తీసుకోవడం లేదని ఆత్మహత్య

- గడ్డి మందు తాగిన కాంట్రాక్ట్ కార్మికుడు
- చికిత్స పొందుతూ మృతి


బాలకృష్ణ(ఫైల్)

జైపూర్: ఎస్టీపీపీలో తనను విధులకు తీసుకోవడం లేదని మనస్తాపంతో కాంట్రాక్టు కార్మికుడు గడ్డిమందు తాగి ఆత్మహత్యకు పాల్పడ్డాడు. స్థానికులు తెలిపిన వివరాలు..పెగడపల్లి గ్రామానికి చెందిన మాసు బాలకృష్ణ(35) ఎస్టీపీపీలోని పవర్‌మేక్ కంపెనీలో బీవోపీ(బ్యాలెన్స్ ఆఫ్ ప్లాంటు) హెల్పర్‌గా పని చేస్తున్నాడు. 8 ఏళ్లుగా పని చేస్తుండగా, గతంలో ఊపిరితిత్తులు చెడిపోవడంతో విధులకు వెళ్లలేదు. ఓ వైపు ఆర్థిక ఇబ్బందులు, మరో వైపు దుమ్ముతో గత మూడు నెలలుగా అనారోగ్యం బారినపడ్డాడు. విధులకు వెళ్లడం లేదు. ఆరోగ్యం కుదటపడ్డాక డ్యూటీలోకి తీసుకోవాలని పక్షం రోజులుగా అధికారుల చుట్టూ తిరిగినా పట్టించుకోలేదు. దీంతో మనస్తాపం చెందిన బాలకృష్ణ గురువారం సాయంత్రం ఇంట్లో గడ్డి మందు తాగాడు. కుటుంబీకులు గమనించి మంచిర్యాలకు తరలించగా చికిత్స పొందుతూ శుక్రవారం మృతిచెందాడు. భార్య లక్ష్మి ఫిర్యాదుతో కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై శ్రీధర్ తెలిపారు. మృతుడికి ఇద్దరు కుమారులు రిషీచంద్ర, నిహాల్ ఉన్నారు.

అనారోగ్యంతో ఒకరు..


నాందేవ్ (ఫైల్)

వాంకిడి: అనారోగ్యంతో బాధపడుతున్న ఓ వ్యక్తి గడ్డి మందు తాగి ఆత్మహత్యకు పాల్పడినట్లు ఎస్సై ప్రశాంత్ తెలిపారు. ఆయన కథనం ప్రకారం.. మండల కేంద్రానికి చెందిన హివ్రె నాందేవ్ (54) గతేడాది పక్షవాతం లక్షణాలతో బాధపడుతున్నాడు. కొన్నిరోజులుగా మనోవేదనకు గురయ్యాడు. ఈ క్రమంలో జీవితంపై విరక్తితో శుక్రవారం ఇంట్లో ఎవరూ లేని సమయంలో గడ్డి మందు తాగాడు. గమనించిన కుటుంబీకులు ఆసిఫాబాద్ ఆసుపత్రికి తరలించగా అప్పటికే మృతిచెందాడు. కుటుంబ సభ్యుల ఫిర్యాదుతో కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

అట్టహాసంగా జోనల్ స్థాయి గిరిజన క్రీడోత్సవాలు


జ్యోతి ప్రజ్వలన చేస్తున్న ఎమ్మెల్యే

ఉట్నూర్‌రూరల్: ఉట్నూర్ కేబీ ప్రాంగణ మైదానంలో శుక్రవారం జోనల్ స్థాయి గిరిజన క్రీడోత్సవాలు అట్టహాసంగా ప్రారంభమయ్యాయి. ఖానాపూర్ ఎమ్మెల్యే వెడ్మ బొజ్జు, ఐటీడీఏ పీవో ఖుష్బూ గుప్తా ఈ పోటీలను ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ ప్రభుత్వం క్రీడల అభివృద్ధిపై ప్రత్యేక దృష్టి సారించిందన్నారు. గతంలో ఎన్నడూ లేని విధంగా బడ్జెట్‌లో క్రీడల కోసం రూ.325 కోట్లు కేటాయించిన ఘనత సీఎం రేవంత్ రెడ్డికి దక్కిందన్నారు. ఈ ఏడాది అక్టోబర్‌లో సీఎం కప్ క్రీడలు నిర్వహిస్తామన్నారు. ఐటీడీఏ పీవో మాట్లాడుతూ క్రీడల్లో రాణించేలా గిరిజన విద్యార్థులను అన్నివిధాలుగా ప్రోత్సహిస్తున్నామన్నారు. అనంతరం కేబీ ప్రాంగణంలోని పీఎంఆర్సీ సమావేశ మందిరంలో ఈఎంఆర్ఎస్ డిగ్రీ కళాశాల ఆధ్వర్యంలో ఫేర్‌వెల్ కార్యక్రమానికి పీవో హాజరయ్యారు. విద్యార్థులకు ప్రశంస పత్రాలు అందజేశారు. అసిస్టెంట్ కలెక్టర్ అజ్మీర సంకేత్, ఏపీవో వసంత్‌రావు, కాంగ్రెస్ నాయకుడు సామ ప్రభాకర్ రెడ్డి, జిల్లా గిరిజన క్రీడల అధికారి పార్థసారథి, ఏటీడీవోలు క్రాంతి, అమిత్, నిహారిక, హెచ్‌ఎంలు ప్రకాశ్, ఆత్రం భాస్కర్, ప్రేమ్‌దాస్ పాల్గొన్నారు.

1న జోనల్ స్థాయి క్రీడాపోటీలు

ఆసిఫాబాద్‌రూరల్: జిల్లా కేంద్రంలోని గిరిజన ఆదర్శ క్రీడాపాఠశాలలో అక్టోబర్ 1న జోనల్‌స్థాయి క్రీడాపోటీలు నిర్వహిస్తున్నట్లు డీటీడీవో రమాదేవి శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఇటీవల గిరిజనశాఖ ఆధ్వర్యంలో జరిగిన డివిజన్ స్థాయి పోటీల్లో ప్రతిభ కనబర్చి జోనల్‌స్థాయికి ఎంపికైన విద్యార్థులు ఈ నెల 30న డీఎస్‌వో మీనారెడ్డికి రిపోర్టు చేయాలని సూచించారు. అక్టోబర్ 1న మంచిర్యాల, జై నూర్, కాగజ్‌నగర్ డివిజన్ క్రీడాకారులకు జోనల్‌స్థాయి పోటీలు ఉంటాయని తెలిపారు.

నేడు అండర్ 17 హ్యాండ్‌బాల్ ఎంపిక పోటీలు

ఆసిఫాబాద్‌రూరల్: జిల్లా కేంద్రంలోని గిరిజన ఆదర్శ క్రీడాపాఠశాలలో శనివారం ఎస్‌జీఎఫ్ ఆధ్వర్యంలో జిల్లాస్థాయి అండర్- 17 హ్యాండ్‌బాల్ పోటీలు నిర్వహిస్తున్నట్లు డీఈవో యాదయ్య ఒక ప్రకటనలో తెలిపారు. జిల్లాలోని అన్ని పాఠశాలల బాలబాలికలు ఈ పోటీలకు అర్హులని స్పష్టం చేశారు. పోటీలకు హాజరయ్యే విద్యార్థులు ఎంట్రీ ఫాం, బోనాఫైడ్, ఆధార్‌కార్డు వెంట తీసుకు రావాలని సూచించారు.